# మధ్య తరం మనిషి

కల్యాణీసోమరాజ్

ప్రకృతి ఇంకా చీకటి దుప్పటి పూర్తిగా తొలగించలేదు. అరుణిమ తాలూక వన్నె చిన్నెలతో ఆకాశం ముంగిట్లో కళ్లాపి చల్లనూ లేదు.

సూర్యుని గోరువెచ్చని కిరణాలు ప్రకృతిని పలకరించనూ లేదు.

హైదరాబాద్ నగరం ఇంకా రాత్రి నిద్ర నుండి లేవనూ లేదు. అయితే అప్పటికే మార్నింగ్ వాకర్స్ పాదస్పర్శతో ఆ పురవీథుల్లో చలనం ఆరంభం అయింది.

పరశురామయ్య కూడా రోజు రెండు కిలో మీటర్ల దూరం కొలిచాక వెనక్కు తిరిగి రావటం ఆయన కొత్తగా చేసుకున్న అలవాటు.

ఆయన ఈ సిటీకి వచ్చి రెండేళ్లు అయింది. రిటైరై నాలుగేళ్లు దాటింది.

తన తల్లి, తండ్రి వున్నన్నాళ్లు పిల్లలిద్దరూ, పరశురామయ్య గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఆ తరువాత మాత్రం "ఒంటరిగా మీరింకా ఆ ఊళ్లో ఎందుకు? మా దగ్గరకొచ్చేయండి, నేను, ఉష ఒక ఊళ్లోనే కదా ఉండటం!" అంటూ గట్టి పట్టుదలతో హైదరాబాద్‌కి రప్పించుకున్నారు.

ఉన్న ఇల్లు అమ్మటానికి ఆట్టే సేపు పట్టలేదు. బాధ్యతలంటే ముందుకు రాని తమ్ముళ్లు, ఇంటి వాటాల విషయం దగ్గరుండి చూసుకున్నారు. తన వంతు వాటా రెండు లక్షలు తీసుకొని పల్లెటూరితోనూ, ఆ ఇంటితోనూ, అన్ని సంబంధాలూ తెంపుకున్నాడు పరశురామయ్య.

బ్యాంక్ రేట్లు విపరీతంగా తగ్గిపోయి సామాన్యమానవుడిని చావు దెబ్బ తీశాయి. ఈ తరుణంలో ఇల్లు అమ్మిన దాంట్లో వచ్చిన రెండు లక్షలు కూతురికి, కొడుక్కి చెరిసగం ఇచ్చేసి చేతులు కడుక్కున్నాడు. నెలకొకసారి వచ్చే పెన్షన్ తప్పించి మరో ఆదాయం లేనివాడు అయ్యాడు.

కొడుకు ఇంజినీరింగ్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ ప్రొఫెసర్. కోడలు బ్యాంక్‌లో ఆఫీసర్. రెండు-మూడేళ్ల క్రితం కట్టుకున్న ఇండిపెండెంట్ హౌస్. ఖరీదైన కాన్వెంట్‌లో చదువుకుంటున్న ఇద్దరు మనుమళ్లు, వీళ్లెవ్వరికీ పరశురామయ్య కొచ్చే పెన్షన్ మీద ఆశ లేదు. అయితే ఆ ఇంట్లో డబ్బుకెంత కరవు లేదో పనికి అంత లోటూ లేదు.


కాలేజీలకు, ఆఫీసులకు అంతా వెళ్లిపోతే, ఇంకా మిగిలేది తగులు, మిగులు పని, పరశురామయ్య, శాంతాను.

"ఇక్కడ ఎంత డబ్బు పోసినా మంచి పనిమనుషులు దొరకరత్తయ్యా! ఎక్కువ పని మనం చేసుకోవడమే" అంటూ అత్తగారికి ఎన్నో పదవులు అప్పగించింది వచ్చిన కొత్తల్లోనే.

"ఇది వాషింగ్ మిషనండి. ఇందులో బట్టలు వేస్తే, అది ఉతికి పెడుతుంది. తీసి ఆరేసుకోవటమే!" అంటూ బట్టలు ఉతికే బాధ్యతను నెట్టేస్తూ.

"ఇక్కడంతా పనిమనుషులు సరిగ్గా ఉదయాన్నే రారు. నాకు ప్రతి రోజూ ముంగిట్లో ముగ్గు పెట్టే సెంటిమెంట్ తక్కువ. కుదిరినప్పుడు పెడతాను, మీకు అలాంటి నమ్మకాలు ఉంటే మీరు పొద్దున్నే ఎలాగూ లేస్తారు కాబట్టి ముగ్గు పెట్టేయండి" అంటూ చీపురు, ముగ్గు డబ్బా చూపించింది అత్తగారికి.

"ఆc, తరువాత నాకు, ఆయనకి, పిల్లలకి బ్రెడ్ ఉంటే చాలు బ్రేక్ ఫాస్ట్ వెళ్లిపోతుంది. మీకు, మామయ్య గారికీ టిఫిన్స్ కావాలంటే, మీ హడావిడి



అయ్యాక మీరు చేసుకోండి ఇడ్లీ రుబ్బాలంటే గ్రైండర్ ఉంది. మీరు శ్రమ పడక్కర్లేదు. వంట కూడా మా వరకు నేను చేసేసుకుంటాను. మీకు అప్పుడే వండితే చల్లారిపోయి బాగుండదు కదా. మెల్లగా మీరు భోజనం చేసే ముందర వండుకోండి" అంటూ వంటింటి విధులు కూడా అప్పచెప్పిన కోడలి గడుసుతనం చూడగానే, 36 ఏళ్ల క్రితం కొత్తగా పెళ్లై వచ్చిన తనతో అత్తగారు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"శాంతా! నాకు కాస్త శుభ్రత ఎక్కువ గాని మీ మామగారికీ, నాకూ పొద్దున వంట నేను చేసుకుంటాను. నీవు, మీ మరుదులకు, ఆడబడుచులకు ఎవరికేం కావాలో కనుక్కొని వండు. సాయంకాలం మే మెలాగూ భోజనం చేయం ఏదో ఒకటి టిఫిన్ చేస్తే చాలు" అంటూ తన లేత భుజాల మీద బరువైన బాధ్యతల్ని మోపిన అత్తగారు, మళ్లీ కనిపించింది కోడలి రూపంలో.

అప్పుడు 'సరే'నంటూ తల ఊపింది. ఇప్పుడూ 'అలాగే' అంటూ తల ఊపింది.

అత్తగారి ముందు ఒంగిన తల, ఇప్పుడు కోడలి ముందు మళ్లీ ఒంగింది.

ప్రభుత్వాలు మారినయ్యి.

మనుషులు మారారు.

పద్ధతులు మారలేదు.


అలాగే శాంత బాధ్యతలూ వదల్లేదు.

మరోసారి కొడుకు ఇంట్లో గుర్తింపు లేని ఉద్యోగంలో చేరిపోయింది శాంత.

పరశురామయ్యకి చాలాకాలంగా ఒక కోరిక ఉండేది. భార్యని తీసుకొని పుణ్యక్షేత్రాలు కొన్నైనా చూడాలని. పిల్లలు చిన్నప్పుడు పిల్లల్తో తిరగటం కష్టం అని, తన బడ్జెట్‌లో అంత మంది కలిసి తిరిగే అవకాశం లేదనుకుంటూ వెళ్లలేదు. పిల్లలు పెరిగి పెద్దవాళ్లయ్యాక, తల్లీ దండ్రిని చూసేవాళ్లు లేక కదల్లేదు.

కొడుకు, కోడలు సెలవుల్లో సౌత్ టూర్ అంటూ పిల్లల్ని తమ మీద వదిలేసి వెళ్లినప్పుడు, ఈ మాత్రం తెగువ తనెందుకు చూపలేకపోయాడో అర్థం కాలేదు.

జీవితంలోంచి వసంతం వెళ్లిపోయింది. పిల్ల తెమ్మెరలు పూర్తిగా ఆఘ్రాణించకుండానే సంధ్యాసమయం వచ్చేసింది. పోగొట్టుకున్నవి పోగొట్టుకున్నాక జీవనమాధుర్యం ఒలికిపోయిందని ఇప్పుడింక బెంగ పడి ప్రయోజనం ఉందా?



తండ్రి చనిపోయినప్పుడు—'రామభద్రయ్య' అదృష్టవంతుడు. ఏ చీకూ చింతాలేకుండా, సొంత ఊళ్లో, సొంత ఇంట్లో కడుపులో చల్ల కదలకుండా 'రాజా'లాగా బ్రతికాడు. అందరికీ అంత అదృష్టం పడుతుందా 'అంటూ అసూయపడుతూనే ఆపేక్షగా పలికారు ఊరివారందరూ.

ఆ నాడు తండ్రి అదృష్టం గురించి అర్థం కాకపోయినా, ఆయన్ని అదృష్టవంతుణ్ని చేయటానికి తాను ఎన్ని త్యాగాలు చేయాల్సి వచ్చిందో అన్న విషయం మాత్రం మనసును కెలికేది.

పరశురామయ్యకి ఇప్పటికీ గుర్తే! తాను బి.ఎస్‌సి. ఫస్ట్ క్లాసులో పాసయ్యానని తెలిసిన రోజు, ఆ ఉత్సాహం జారకుండానే, తోటి స్నేహితులతో ఎమ్.ఎస్‌సి.కి అప్లికేషన్ తెచ్చుకున్నరోజు.

తండ్రి గుమ్మంలోనే ఎదురైతే ముందుగా ఆయనకే చెప్పాడు.

"బి.ఎస్‌సి. పాసైనందుకు సంతోషం. కాని ఎమ్.ఎస్‌సి. అంటూ పై చదువులకి పట్నం వెళ్లాలంటే, చదివించే స్తోమత నాకు లేదు. నీకింకా ఇద్దరు తమ్ముళ్ల చదువు బాధ్యత, ఇద్దరి చెల్లెళ్ల పెళ్లి బాధ్యత గుర్తు చేయాల్సి వస్తుంది. ముందు. బి.ఇడి. చెయ్యి. ఊళ్లో స్కూల్లో టీచర్‌గా చేరచ్చు. కమిటీ మెంబర్స్ నాకు పరిచితులే! అయినా లంకంత కొంప, నాలుగు ఎకరాల భూమి-ఇవన్నీ వదులుకొని పొరుగూరిలో ఉద్యోగం చేయడం ఎందుకు?" అంటూ తన ఊహాసౌధాన్ని సమూలంగా కూల్చేశాడు ఆ రోజే.

తండ్రి చెప్పిన ఎకరాలు ఆడపిల్లల పెళ్లిళ్లకే హారతి కర్పూరాలయ్యాయి. లంకంత కొంప మాత్రం అప్పుడప్పుడు తనఖాలు పెట్టుకున్నా చెక్కుచెదరని పాత శిలాశాసనంలా అలాగే ఉంది మొన్నటి వరకూ.

మార్నింగ్ వాక్ ముగించుకొని ఇంట్లోకి అడుగు పెడుతుండగానే, ముందు మంచి నీళ్లు తరువాత పది నిముషాలకు పొగలు కక్కే కాఫీ కప్పుతో ఎదురుపడే శాంత, ఆ రోజు ఎంతకీ బయటకు రాలేదు.

ఇంట్లో ఇంకా ఎవ్వరూ మేల్కొన్న జాడ లేదు. పరశురామయ్య వంట ఇంట్లోకి వెళ్లే సరికి శాంత అప్పుడే లేచినట్లుంది, కాఫీకి ఫిల్టర్ వేస్తోంది.

"శాంతా, ఇప్పుడే లేచావా?" అంటూ పలకరించాడు.

"ఆఁ... రాత్రి నిద్ర పట్టలేదు." అంది ఉదాసీనంగా.

"ఏం అలా వున్నావ్? ఒంట్లో బాగా లేదా?"

"బాగానే ఉంది..."

"కోడలు ఏమైనా అందా?" కాఫీ కప్పు అందుకుంటూ భార్యను మళ్లీ పరామర్శించాడు.

"ఛ... అలాంటిదేమీ లేదు. ఇంతకీ ఆ ఇంటి విషయం ఏమాలోచించారు?" అంది చివరకు.

అదన్నమాట, శాంతను కలవర పరుస్తున్న విషయం.

"ఆ ఇంటి గురించి వున్న పళంగా ఆలోచించాల్సింది ఏముంది శాంతా?"

"మరిచిపోయారా? ఉష ఆ విషయం మాట్లాడటానికే ఈ రోజు ఆదివారం కదా అని, వస్తానంది!" ఇంక తను చెప్పాల్సింది చెప్పినట్లు శాంత బయటకు వెళ్లిపోయింది.

ఆరు నెలల క్రితం శాంత పిన్ని ఒకామె చనిపోతూ, వారసులు ఎవ్వరూ లేకపోవటంతో, ఆమె పేరనున్న చిన్న డాబా ఒకటి శాంత పేరున రాసి మరీ పోయింది.

బ్యాంక్ రేట్లు విపరీతంగా తగ్గిన ఈ తరుణంలో పల్లెటూళ్లో వున్నా, ఇంటి మీద వచ్చే అద్దె కొండంత లాభంగా అనిపించి దాని జోలికి వెళ్లలేదు పరశురామయ్య.

అయితే నెల రోజుల క్రితం ఇంట్లో ఉన్న వాళ్లు ఖాళీ చేస్తున్నామని చెప్పటంతో, ఇల్లు స్వాధీనం చేసుకోటానికి శాంత వెంట పరశురామయ్య కూడా వెళ్లక తప్పలేదు.

విజయవాడ, బందరు మధ్యలో అటు కలవాలో, ఇటు కలవాలో అర్థం కాక నిలచినట్లున్న చిన్న ఊరు. పట్టుమని పది వీధుల్లేని ఊరు కాని ఊరు.

ఇల్లు నాలుగు గదులతో చిన్నదిగా కనిపించినా, చుట్టూ ఆవరణ చాలా పెద్దది. మామిడి, జామ, కొబ్బరితో పాటు అంతకు ముందున్న యజమానుల అవసరాలు తీర్చినట్లు మిడిసిపడుతున్న కూరల మడులు, వచ్చినవాళ్లని నవ్వుతూ పలకరించే రంగురంగుల పూలు. మొత్తానికి అభిరుచి వున్న మాలి చేతిలో మంత్రదండంతో మలచినట్లుంది.

అక్కడున్నది నాలుగు రోజులే అయినా, ఇద్దరికీ స్వేదం తుడిచి సేద తీర్చినట్లుంది. శాంతని అంత ఉషారుగా ఎప్పుడు చూసి ఉండదు. పొద్దున్నే పని హడావిడులు లేవు, ఇంకొకరి అదుపాజ్ఞలు లేవు.

"అబ్బ! కొన్నాళ్లు ఇక్కడే ఉందామండి..." అంది ఆ సంతోషంతోనే ఒకరోజు.

శాంతకా కోరిక కొత్తగా కలిగింది కాదని పరశురామయ్యకి తెలుసు.

తను ఉద్యోగం చేసే రోజుల్లో గవర్నమెంట్ మూకుమ్మడిగా ట్రాన్స్‌ఫర్స్ చేసింది, టీచర్లను. అందులో తనూ ఉన్నాడు. పక్కనే మరో గ్రామానికి బదిలీ అయింది.

(మిగతా వచ్చే వారం)